క్లుప్తంగా

ఒలింపియాడ్‌లో బంగారు పతకాలు



తెనాలిఅర్బన్: జాతీయ స్థాయిలో జరిగిన రెండు ఒలింపియాడ్ పోటీల్లో బోసు రోడ్డులోని నెహ్రూనికేతన్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌కు చెందిన ఆరుగురికి బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం లభించిందని స్కూల్ మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ తెలిపారు. న్యూఢిల్లీకి చెందిన సిల్వర్ జోన్ ఫౌండేషన్ వారు జనవరి నెలలో పోటీలను నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర స్థాయిలో మంచి ర్యాంకులు, పతకాలు సాధించిన విద్యార్థులను సోమవారం స్కూల్ ఆవరణలో అభినందించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సారస్వత పరిషత్ సంకలనంలో హకీం కథ



తెనాలి: తెలంగాణ సారస్వత పరిషత్ రూపొందిస్తున్న బాలల కథా సంకలనంలో పట్టణానికి చెందిన బాల సాహితీవేత్త షేక్ అబ్దుల్ హకీంజాని రచన 'నాలుగు గుండిగలు' కథ ఎంపికైంది. పరిషత్ అధ్యక్షుడు ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జె.చెన్నయ్య ఈ విషయం తెలియజేసినట్టు హకీంజాని సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. బాల రచయితలు, బాల సాహితీవేత్తలు రచించిన కథలతో పరిషత్ రెండు బాలల కథా సంకలనాలను ప్రచురిస్తోందని, ఇందుకోసం రెండు తెలుగు రాష్ట్రాలతోపాటు ఇతర రాష్ట్రాలోలని రచయితలు 317 కథలు పంపారు. వీటిలో బాలలు రచించిన 31 కథలు, బాలసాహితీవేత్తలు రాసిన 86 కథలు మొత్తం 117 కథలను ఎంపిక చేసినట్టు తెలియజేశారు. బాల సాహిత్యంపై హకీంజాని ఇప్పటివరకు 86 పుస్తకాలు, 282 కథలు రాశారు.

పింఛన్ల పంపిణీపై బురద జల్లాలని చూస్తున్నారు



తెనాలి: వలంటీర్ల నుంచి ఫోన్లు, ట్యాబ్‌లను మాత్రమే అధికారులకు అప్పగించమని ఎన్నికల కమిషన్ ఆదేశించింది మినహా అధికారులు ఇంటింటికి వెళ్లి పింఛన్లు అందజేయొద్దని ఎక్కడా చెప్పలేదని జనసేన పీఏసీ చైర్మన్, తెనాలి అసెంబ్లీ ఉమ్మడి కూటమి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ అన్నారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పింఛన్లు పంపిణీ చేయాల్సిన బాధ్యత ప్రభుత్వం, ప్రభుత్వ అధికారులదేనని చెప్పారు. వీరితో జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు ఉన్నారు.

బకింగ్‌హామ్ కెనాల్‌లో గుర్తుతెలియని మృతదేహం

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని మోరంపూడి భారత్ పెట్రోల్ బంక్ ఎదురుగా బకింగ్‌హామ్ కెనాల్‌లో మృతదేహం ఉన్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ మహేంద్ర సోమవారం సంఘటనా స్థలానికి వెళ్లి ముళ్లపొదల్లో ఇరుక్కుపోయి ఎముకలు బయటపడిన మృతదేహాన్ని బయటకు తీయించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేంద్ర మాట్లాడుతూ మృతిచెందిన వ్యక్తి వయస్సు 50–60 సంవత్సరాలు ఉండవచ్చని, ఎప్పుడు బకింగ్ హామ్ కెనాల్‌లో కొట్టుకు వచ్చి ముళ్ల పొదల్లో ఇరుక్కుపోయి మృతదేహం కుళ్లిపోయి ఎముకలు బయటపడ్డాయని, మృతుని వంటిపై బ్లూ, ఎరుపు రంగు కలిగిన షర్ట్, బ్లూ కలర్ ఫ్యాంట్ ఉన్నాయని, మోరంపూడి వీఆర్ఓ దేవరపల్లి రత్నకుమారి సమక్షంలో గుర్తుతెలియని మృతదేహంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేంద్ర తెలిపారు.

8న భక్తాంజనేయస్వామి తిరునాళ్ల

ఫిరంగిపురం: మండలంలోని వేములూరిపాడు గ్రామ శివారులోని గరువుకొండ వద్దనున్న భక్తాంజనేయస్వామి 14వ తిరునాళ్ల ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నట్లు ఆలయఅభివృద్ధి కమిటీ సభ్యులు సోమవారం తెలిపారు. అదేరోజు సాయంత్రం తిరునాళ్ల సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి గ్రామోత్సవం నిర్వహిస్తామని చెప్పారు. 9వతేదీన ఉగాది పండుగనాడు స్వామివారికి నాగవల్లీ దళాలతో అష్టోత్తర, సహస్త్రనామ పూజలను అర్చకులు నిర్వహిస్తారన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం ఉంటుందని తెలిపారు.

ఓటు ప్రాధాన్యత తెలుసుకోండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మానవహారం నిర్వహిస్తున్న ఎన్‌సీసీ విద్యార్థులు

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని దానిని గుర్తెరిగి అందరూ తమ ఓటు హక్కును వచ్చే ఎన్నికల్లో వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్వీప్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో రజక చెరువు నుంచి చినరావూరు పార్కు వరకు సోమవారం ర్యాలీ నిర్వహించారు. ఓటు వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. అందరూ స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీల ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరితో చేయించారు.

● స్వీప్ కార్యక్రమంలో భాగంగా తెనాలి పురపాలక సంఘం ఆధ్వర్యంలో తెనాలి, నందివెలుగు మీదుగా కొల్లిపరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. కొల్లిపరలో ఏర్పాటు చేసిన సమావేశంలో కమిషనర్ శేషన్న మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఓటు వినియోగంపై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెరిగే విధంగా చూడటమే తమ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, మెప్మా సీఎంఎం అరుణ, మాధవరావు, ఏసీపీలు సుధాకర్, సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్రరావు, పెద్ద సంఖ్యలో మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఓటు హక్కు ప్రాధాన్యంపై అవగాహన ర్యాలీ

కొల్లిపర: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వయోజనులందరూ తమ ఓటు హక్కును సద్వినియోగ పరచుకోవాలని తెనాలి మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. సోమవారం తహసీల్దారు ఎన్.శ్రీనివాసులు, ఎంపీడీవో విష్ణుప్రసాద్ ఆధ్వర్యంలో ఓటు ప్రాముఖ్యత గురించి రెవెన్యూ సిబ్బందితో కొల్లిపర గ్రామంలో బైకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఓటు విలువను తెలియజేసే ప్లకార్డులను ప్రదర్శించారు. కొల్లిపర ప్రధాన కూడలిలో మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. ఓటు హక్కు, స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్ ప్రోగ్రాం)పై ప్రధాన కూడలిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తెనాలి మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష, తెనాలి అసిస్టెంట్ సిటీ ప్లానర్‌లు సుబ్బారావు, సుధాకర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామచంద్ర, ఆర్ఐ కె.శ్రీనివాసరావు, ఈవో పీఆర్డీ పూర్ణశంకరరావు, మండల పరిపాలన ఏవో వి.చంద్రమోహన్, వీఆర్‌వోలు, వీఆర్ఏలు, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.



బైక్ ర్యాలీలో పాల్గొన్న కమిషనర్ శేషన్న



పట్టణంలో జరిగిన ర్యాలీ



కొల్లిపరలో ఓటరు అవగాహన బైకు ర్యాలీ

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి శక్తివంచన లేకుండా కృషి

పట్టణ క్లస్టర్–2 ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండ్లమూడి నాగేశ్వరరావు



ఎమ్మెల్యే శివకుమార్, నాగేశ్వరరావుకు గజమాలతో సత్కారం

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి పట్టణ క్లస్టర్–2 ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా స్థానిక 27వ వార్డుకు చెందిన పార్టీ నేత బండ్లమూడి నాగేశ్వరరావు (నాని) నియమితులైన సందర్భంగా ఆదివారం రాత్రి పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. గంగానమ్మపేటలోని పార్టీ కార్యాలయానికి చేరుకుని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిశారు. గజమాలతో సత్కరించి, తన నియామకానికి సహకరించినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పార్టీని ఇంటింటికీ తీసుకెళ్లి బలోపేతం చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు. నాగేశ్వరరావును పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. స్వీట్లు పంచారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ ఐక్యవేదిక అధ్యక్షుడు అక్కిదాసు కిరణ్‌కుమార్ మాట్లాడుతూ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నియమితులైన బండ్లమూడి నాగేశ్వరరావు పార్టీ విజయానికి కృషి చేయాలని, అదేవిధంగా ఎస్సీ సామాజికవర్గానికి తన వంతు తోడ్పాటును అందించాలని సూచించారు. కార్యక్రమంలో యాతాటి అనిల్, రావి శ్రీనివాసరావు, కోగంటి ఆషు, నాగసరపు కృష్ణ, జీఎంఆర్‌జీ సత్యం, కుర్రా జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్సార్‌సీపీని గెలిపించండి



కరపత్రాలు పంపిణీ చేసి ఓట్లు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప



సంక్షేమ పథకాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే కుమారుడు సత్యనారాయణ

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప కోరారు. సోమవారం సాయంత్రం 16వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్‌లు మాలేపాటి హరిప్రసాద్, అత్తోట నాగవేణి, వైఎస్సార్‌సీపీ నాయకులు కాళిదాసు విజయశ్రీ, కాళిదాసు వెంకటసత్యం, కాకి దేవసహాయం, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కఠెవరంలో 5వ రోజు ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం సోమవారం 5వ రోజు జరిగింది. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమాప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు పినపాటి అనిల్, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, గ్రామ ఉప సర్పంచ్ షేక్ బాబు సాహెబ్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, మంచాల శ్రీనివాసరావు, షేక్ ఆదాం షఫీ, ఆర్.శ్రీనివాసరెడ్డి, కారుమూరు వీరారెడ్డి, చిన్నిబాబు, తాడిబోయిన శంకరరావు, తుల్లిమిల్లి సువర్ణబాబు, గాలి శివకుమార్, చావలి అశోక్, గంపల హేమచంద్రరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

30 మద్యం బాటిళ్లు పట్టివేత



పోలీసులు పట్టుకున్న మద్యం సీసాలు

మంగళగిరి: దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద 30 మద్యం బాటిళ్లను రూరల్ పోలీసులు పట్టుకున్నారు. సోమవారం రూరల్ ఎస్ఐ క్రాంతికుమార్ తెలిపిన వివరాల మేరకు విజయవాడకు చెందిన కె.రవీంద్ర, బీట సాయి, దూది వరుణ్‌కుమార్‌లు కారులో విజయవాడ నుంచి తెనాలి మద్యం బాటిళ్లు తరలిస్తుండగా దుగ్గిరాల మండలం రేవేంద్రపాడు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టు వద్ద తనిఖీ నిర్వహించి స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్శిల్ కార్యాలయాలలో తనిఖీలు..

పట్టణంలో ఆటోనగర్‌లోని పలు పార్శిల్ కార్యాలయాలలో పట్టణ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ శ్రీనివాసరావు తనిఖీలు నిర్వహించిన అనంతరం మాట్లాడుతూ పార్శిల్ కార్యాలయాలలో ఏవైనా అనుమానస్పదంగా పార్శిల్ వస్తే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఏవైనా పెద్ద సంఖ్యలో ఇంటి సామాగ్రి, చీరలు, మిక్సీలు లాంటి పార్శిల్‌లో వస్తే తమ దృష్టికి తీసుకురావాలని పార్శిల్ కార్యాలయాల నిర్వాహకులను ఆదేశించినట్లు తెలిపారు.

86 శాతం పన్నులు వసూలు

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ఇంటి, ఖాళీ స్థలం పన్నులు, షాపు అద్దెల కింద రావాల్సిన నిధుల్లో 86.40 శాతం ఆదివారం నాటికి వసూలు చేసినట్లు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ సోమశేఖర్ యాదవ్ సోమవారం తెలిపారు. తెనాలి పట్టణంలో పన్నులు, అద్దెల రూపంలో రూ.16.72 కోట్ల నగదు రావాల్సి ఉందని, మార్చి 31 నాటికి రూ.14.44 కోట్లు వసూలు చేశామని చెప్పారు. మిగిలినవి కూడా వసూలు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

అవ్వాతాతల అగచాట్లు...

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పింఛన్ల కోసం కాళ్లరిగేలా కార్యాలయాల చుట్టూ తిరిగిన వెతలు తీరుస్తూ.. సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం వలంటీర్ల వ్యవస్థ ద్వారా వృద్ధులకు ఊరట కల్పిస్తూ.. ఇంటి వద్దనే పింఛన్ అందించింది. ప్రతి నెల ఒకటో తారీఖునే జగన్ ప్రభుత్వం పింఛను లబ్ధిదారుల ఇంటి వద్దనే పింఛన్ అందించింది. కాగా తాజాగా ఎన్నికల కమిషన్ వలంటీర్లు పింఛన్ల పంపిణీలో పాల్గొనరాదని ఆదేశించింది. దీంతో అవ్వా తాతలు, వికలాంగులు పింఛన్ ఎలా తీసు కోవాలని ఆందోళన చెందుతున్నారు. ఇప్పు డు మళ్లీ పెత్తందార్ల కుటిల బుద్ధికి ఎన్నికల కోడ్ రూపంలో అవ్వాతాతలు బలైపోతున్నారు.

–కొల్లిపర

చాలా దారుణం



వలంటీర్ల ద్వారా పింఛన్ల పంపిణీని నిలిపి వేయడం చాలా దారుణం. ఈ నెల పింఛన్ ఎలా ఇస్తారో అర్థం కావడం లేదు. 90 ఏళ్ల వయసులో అనారోగ్య పరిస్థితుల్లో నేను పింఛన్ కోసం ఎక్కడికి వెళ్లగలను. నాలాంటి వాళ్లను ఇబ్బంది పెట్టడానికే ఇలాంటి నిబంధనలు పెడుతున్నారా.

– బొమ్ము సీతమ్మ 90 ఏళ్ల వృద్ధురాలు, బొమ్మువానిపాలెం

పంపిణీని అడ్డుకోవడం తగదు



ప్రతి నెలా ఇంటికే పెన్షన్ సొమ్ము ఇస్తూ సీఎం జగన్‌బాబు ఆదుకుంటున్నారు. 77 సంవత్సరాలు వయసు కలిగిన ఎడ్ల లక్ష్మయ్య అనే నేను ప్రభుత్వం 100 రూపాయలు పింఛన్ పంపిణీ దగ్గర నుంచి తీసుకుంటున్నాను. 5 సంవత్సరాల క్రితం బైకు యాక్సిడెంట్‌లో కాళ్ల పూర్తిగా పనిచేయటం లేదు. జగన్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఎటువంటి స్వార్థం లేకుండా ప్రతి నెల 1వ తారీఖున ఇంటికే వచ్చి వలంటీర్ పింఛన్ ఇస్తున్నారు. ఎన్నికల సమయంలో వలంటీర్ పింఛన్ ఇవ్వకూడదు అని చంద్రబాబుకు చెందిన వారు కోర్టుకు వెళ్లి నడవలేకుండి ఉన్న మాలాంటి వాళ్లకు ఇంటి వద్దకే అందిస్తున్న పింఛన్ డబ్బులు ఇవ్వకుండా అడ్డుకోవటం సరికాదు. నడవలేని నేను 2 కిలో మీటర్ల దూరంలో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలనికి వెళ్లి ఏ విధంగా పింఛన్ తెచ్చుకోగలను. ప్రతిసారి పెదల జీవితాలతో ఆడుకోవటం చంద్రబాబుకు అలవాటే. ఇలాంటి చంద్రబాబును మేము ఎప్పటికీ నమ్మం.

–ఎడ్ల లక్ష్మయ్య, తూములూరు శివారు చింతలపాలెం

'గేట్' ర్యాంకర్‌కు ఎల్ఐసీ యూనియన్ అభినందన



తెనాలి: ఎంటెక్‌లో ప్రవేశం కోసం నిర్వహించే 'గేట్' పరీక్షల్లో జాతీయ స్థాయిలో పదో ర్యాంకు సాధించిన రూరల్ మండలం కఠెవరంకు చెందిన యర్రు లక్ష్మీసాయికృష్ణను సోమవారం ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఎంప్లాయీస్ యూనియన్, తెనాలి యూనిట్ ఘనంగా సత్కరించింది. కఠెవరంలోని వారి నివాసానికి వెళ్లి లక్ష్మీసాయికృష్ణను, ఆయన తండ్రి సాంబశివరావును సత్కరించి, అభినందనలు తెలియజేశారు. యూనియన్ నాయకులు వేదాంతం ఫణీంద్ర, దేవరకొండ వెంకట సుబ్బారావు, టి.సురేష్, కె.రాజు, బి.పూర్ణనారాయణ, కె.రవీంద్ర, వై.రాజశేఖర్, పి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రజాదరణను ఓర్చుకోలేని ప్రతిపక్షాలు

కొల్లిపర పార్టీ నేతలు, కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: ఒకవైపు పరిపాలన సంస్కరణలు, మరోవైపు సంక్షేమ పథకాల అమలుతో దేశానికే దిక్సూచిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వస్తున్న ప్రజాదరణను చూసి ప్రతిపక్షాలు ఓర్వలేకపోతున్నాయని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పింఛను పంపిణీ నుంచి వలంటీర్లను దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించటం ఇందుకో నిదర్శనమని చెప్పారు. మండల కేంద్రమైన కొల్లిపర గ్రామానికి చెందిన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముఖ్యనేతలు, కార్యకర్తలతో సోమవారం రాత్రి ఎమ్మెల్యే శివకుమార్ సమావేశమయ్యారు. స్థానిక బుర్రిపాలెం రోడ్డులోని ఇంజినీరింగ్ కాలేజి ఆవరణలో అందరితో మాట్లాడారు. అక్కడి పార్టీ పరిస్థితులపై ఆరా తీశారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో గత ఎన్నికలకు మించిన భారీ మెజార్టీని తీసుకొచ్చేందుకు అంతా కలిసి కృషి చేయాలని సూచించారు. ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు రెండు ఓట్లను తప్పనిసరిగా వేసేలా ప్రతి ఇంటికి ప్రచారం చేయాలని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల లబ్ధిని ఇంటింటికీ గుర్తుచేయాలన్నారు. అదేవిధంగా సంక్షేమ సారథి జగన్‌మోహన్‌రెడ్డిపై చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. తాజాగా అవ్వాతాతలు, ఒంటరి మహిళలు, దివ్యాంగులకు నెలనెలా ఇంటికెళ్లి అందజేస్తున్న పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను దూరం చేయాలంటూ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదులు చేయించి, ఆంక్షలు విధించేలా చేశారని గుర్తుచేశారు. శింగనమల పార్టీ అభ్యర్థి వీరాంజనేయులను టిప్పర్ డ్రైవర్ అంటూ అవహేళన చేయటం వంటి అంశాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్ష మేరకు సార్వత్రిక ఎన్నికల్లో నియోజకవర్గంలో భారీ మెజార్టీని సాధించాలని చెప్పారు. పార్టీ మండల అధ్యక్షుడు అవుతు పోతిరెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, గ్రామ పార్టీ అధ్యక్షుడు భీమవరపు శివకోటిరెడ్డి, బొమ్మారెడ్డి ప్రభాకర్‌రెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, గుదిబండి కృష్ణకిషోర్‌రెడ్డి, మండ్రు ప్రభాకర్, అన్నవరపు రమేష్, మండ్రు రాజు, కళ్లం వీరారెడ్డి, బొంతు కృష్ణారెడ్డి, ఉన్నం నాని తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలిసిన వ్యక్తులకు మద్దతు పలకండి

నందివెలుగులో ఆత్మీయ సమావేశంలో గుంటూరు ఎంపీ అభ్యర్థి వెంకట రోశయ్య



మాట్లాడుతున్న పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు ఎంపీ అభ్యర్థి రోశయ్య

తెనాలిటౌన్: అమెరికా నుంచి దిగుమతి అయ్యే వ్యక్తులకు కాకుండా ప్రజా సమస్యలు తెలిసిన స్థానిక అభ్యర్థులను గెలిపించాలని, వారికి మద్దతు పలకాలని పొన్నూరు ఎమ్మెల్యే, గుంటూరు ఎంపీ అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య కోరారు. రూరల్ మండలం నందివెలుగు గ్రామంలోని కల్యాణ మండపంలో సోమవారం గ్రామస్తులతో జరిగిన ఆత్మీయ సమావేశంలో రోశయ్య పాల్గొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత 10 సంవత్సరాల నుంచి ఎంపీగా ఉన్న జయదేవ్‌ను ప్రజలు చూడలేదన్నారు. పరిశ్రమలు పెట్టి నిరుద్యోగులకు వేలాది ఉద్యోగాలు కల్పిస్తామని ప్రకటించి ఎన్నికల్లో గెలిచారని, ఆ తర్వాత కనీసం ఒక్క పరిశ్రమ కూడా జిల్లాలో ఏర్పాటు చేయలేదన్నారు. రైతుల సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. బ్రిటీష్ కాలం నాటి ఇరిగేషన్, డ్రైనేజ్ కాల్వల ఆధునీకరణకు చర్యలు తీసుకుంటామన్నారు. పొన్నూరు నియోజకవర్గంలో 20 సంవత్సరాల నుంచి పరిష్కారం కాని సమస్యలు నాలుగున్నరేళ్లలో పరిష్కరించామన్నారు. రైతులకు గిట్టుబాటు ధరలు కల్పిస్తూ, పంట నష్ట పరిహారం నేరుగా రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసిన ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో గుంటూరు పార్లమెంటు నుంచి తనను, తెనాలి ఎమ్మెల్యేగా శివకుమార్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ దూళిపాళ్ళ పవన్‌కుమార్, పార్టీ గ్రామ కన్వీనర్ కానుగోలు సురేష్, నాయకులు బొంతు నరేంద్రరెడ్డి, తోటకూర వసంతరావు, తోటకూర సుబ్రమణ్యం, దానబోయిన వెంకటనరసయ్య, తన్నీరు వెంకటేశ్వర్లు, వేముల మహేష్, బెజ్జం బాజి, మంగా చిట్టిబాబు, కమాదుల స్వామి, సోమరాజు విజయలక్ష్మి, పూర్ణ, శాంతిరాజు, బాల గోపి, షేక్ సమీఉల్లా, దుర్గాప్రసాద్, రాజగోపాల్, నవనీతం నాగేశ్వరరావు, నల్లూరు సతీష్, గొర్రె వెంకటేశ్వరులు పాల్గొన్నారు.

ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభించి మజ్జిగ పంపిణీ చేస్తున్న చలపతి విద్యాసంస్థల సెక్రటరీ సుజిత్ కుమార్

మోతడక(తాడికొండ): మోతడక చలపతి ఇంజినీరింగ్ కళాశాల కంప్యూ టర్ సైన్స్ టెక్నో క్రాట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఉచిత మజ్జిగ పంపిణీ శిబిరాన్ని ప్రారంభించారు. అమరావతి – గుంటూరు ప్రధాన రహదారిపై కళాశాల ఎదుట ఉన్న బస్‌స్టాప్‌లో ప్రయాణికుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన ఈ శిబిరాన్ని చలపతి విద్యాసంస్థల కార్యదర్శి వై.సుజిత్ కమార్ రిబ్బన్ కత్తిరించి ప్రారంభించి ప్రయాణికులకు మజ్జిగ అందజేశారు. ఈ సందర్భంగా సుజిత్ కుమార్ మాట్లాడుతూ వేసవి ఎండల తాపం పెరుగుతున్న నేపథ్యంలో ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా ఉండాలనే సేవాభావంతో విద్యార్థులు మజ్జిగ పంపిణీ కేంద్రం ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. విద్యార్థులు చదువుతో పాటు సామాజిక సేవా కార్యక్రమాల్లో పాలు పంచుకునేలా చేయడం వాలన వారిలో సామాజిక స్పృహను పెంపొందించవచ్చన్నారు. ఈ సందర్భంగా కంప్యూటర్ సైన్స్ టెక్నోక్రాట్స్ విభాగం విద్యార్థులను ఆయన అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.నాగ శ్రీనివాసరావు, సీఎస్ఈ విభాగాధిపతి జి.రామచంద్రరావు, పలు విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుది కుల దురహంకార మనస్తత్వం

ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్



తాడేపల్లిరూరల్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు కుల దురహంకార, భూస్వామ్య, నీచ మనస్తత్వం కలిగిన వ్యక్తి అని ఆంధ్రప్రదేశ్ నెడ్ క్యాప్ కార్పొరేషన్ చైర్మన్ వేల్పుల రవికుమార్ అన్నారు. సోమవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లిలో ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవికుమార్ మాట్లాడుతూ చంద్రబాబుకు ఎస్సీ, ఎస్టీలు, నిరుపేదల పట్ల, వివిధ వృత్తులు చేసుకుని గౌరవంగా బ్రతికే శ్రామికుల పట్ల అత్యంత చులకన భావం ఉందని విమర్శించారు. ఉన్నత విద్యాధికుడైన సింగనమల అసెంబ్లీ నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఎం.వీరాంజనేయులను ఉద్దేశించి టిప్పర్ (లారీ) డ్రైవర్‌కు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అసెంబ్లీ సీటు ఇచ్చారని అత్యంత వ్యంగంగా, హేళనగా మాట్లాడారని తప్పుపట్టారు. వీరాంజనేయులు ఉన్నత విద్యాధికుడని, ఉద్యోగం దొరకకపోవడంతో టిప్పర్ డ్రైవర్‌గా నిజాయితీగా తన కుటుంబాన్ని పోషిస్తూ గౌరవంగా జీవిస్తున్నాడని అన్నారు. చంద్రబాబు నాయుడు దృష్టికలో టిప్పర్ డ్రైవర్లు, కారు డ్రైవర్లు, వివిధ వాహనాల డ్రైవర్లు మనుషులు కారా అని ప్రశ్నిస్తున్నామన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి నిరుపేదల పాలిట ఆత్మబంధువు అని, సామాన్యులను సైతం గెలిపించి పార్లమెంట్‌కు, అసెంబ్లీకి పంపగలరని అన్నారు. గతంలో చంద్రబాబు నాయుడు ఎస్సీలలో పుట్టాలని ఎవరు కోరుకుంటారని సభ్య సమాజం సిగ్గుపడే వ్యాఖ్యలు చేశారని మండిపడ్డారు.

మూడు గ్రామాల్లో పోలీసు కవాతు

ఫిరంగిపురం: ప్రజలు తమ ఓటు హక్కును స్వచ్ఛందంగా వినియోగించుకోవాలని సీఐ వీరేంద్రబాబు అన్నారు. మండలంలోని మేరికపూడి, పొనుగుపాడు, మునగపాడు గ్రామాల్లో సోమవారం ప్రత్యేక పోలీసు బలగాలతో పోలీసు కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఉండేందుకు ముందస్తుచర్యలో భాగంగా ప్రజలకు ఓటు హక్కు ప్రాధాన్యాన్ని తెలియపరుస్తున్నామన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటును వినియోగించుకోవాలని చెప్పారు. అనంతరం సీఎస్ఎఫ్, పోలీసు బలగాలతో ఆయా గ్రామాల్లో కవాతు నిర్వహించారు. ఎస్ఐ వీరనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.